# నాగరీకం

కౌశికస



మధ్యాహ్నం మూడు గంటలైంది.

నేనప్పుడు సామాన్యంగా విజిటర్సును చూసే సమయం.

ప్యూను వచ్చి "సార్! మీకోసరం ఎవరో వచ్చారు. లోపలికి పంపించమంటారా?" అన్నాడు.

టేబుల్‌మీద ఆఫీసు కాగితాలను చూసుకుంటున్న నేను కాగితాలమీద నుండి దృష్టి మరల్చకుండానే "సరే పంపించు" అన్నాను. విజిటర్సును కలవడం రోజూ అనవాయితే కాబట్టి.

"హల్లో! మల్లిక్! హౌ ఆర్ యూ? ఈ ఊరికి ట్రాన్స్‌ఫరై ఎన్నాళ్లైంది! ఇంట్లో అంతా కులాసాయేనా? ఆఁ అన్నట్లు – ఇంతకీ అసలు నన్ను నీవు గుర్తుపట్టావా? లేదా?"

అని ధారాళంగా మాట్లాడుతున్న వాడల్లా – తన వాగ్ధాటికి తానే బ్రేకువేసి – మధ్యలో నన్ను ప్రశ్నించాడు.

"ఆఁ! లేదండి! మీరెవరో చెప్పేన గుర్తురావడంలేదు, క్షమించాలి. మరేం లేదు, రోజూ ఆఫీసులో ఎంతోమందిని

కలుస్తుంటాంగదా! కొందరగా గుర్తించలేకపోతున్నాను. అదీగాక నాకొంచెం జ్ఞాపకశక్తి కూడా తక్కువేలెండి." అన్నాను, కొంచెం అపాలజిటికల్‌గానే.

నిజంగా అతనెవరో ఇప్పటికీ నాకు గుర్తురావడంలేదు లీలగానైనా.

"అదేనోయ్ మల్లిక్. శివపురం హైస్కూలులో మనమిద్దరం ఒకే క్లాసులో చదువుకునేవాళ్ళం. నీవేమో ముందుబెంచీమీద కూర్చునేవాడివి. నేను నీ వెనకాల బెంచీమీద కూర్చునేవాణ్ణి. మనమిద్దరం 'క్రి' సెక్షన్లో ఉండేవాళ్ళం."

"ఆc.... కావచ్చులెండి."

"కావచ్చేమిటీ, నా మొహం - అయితేనూ - మనమిద్దరం కలిసే చదువుకుంటేనూ, మన క్లాసులోనే శేషరత్నం అనే రెండు జడల అమ్మాయికూడా ఉండేది. ఆ అమ్మాయిని మనమందరం ఏడ్పించేవాళ్ళం. ఇప్పుడైనా గుర్తుకొస్తున్నానా లేదా?" అన్నాడు, నా చిన్నప్పటి విషయాలన్నీ గుర్తుచేస్తూ -

నేను శివపురంలో చదువుకున్నమాట నిజమే. మా క్లాసులో శేషరత్నం అనే అమ్మాయి ఉన్నమాట నిజమే. ఇవన్నీ గుర్తుకొస్తున్నాయ్. కాని గుర్తుకు రాందల్లా - ఇదిగో - ఈ జ్ఞాపకంచేస్తున్న రావుగారే!

ఇన్ని మా చిన్నప్పటి విషయాలు చెబుతూంటే అతనెవరో తెలియదంటే మర్యాదగా ఉండదని, "ఆc అయితే రావుగారూ! మీరెక్కడ పనిచేస్తున్నారు." అన్నాను మర్యాదకోసమని.

"నేను "రావ్స్ అండ్ రావ్స్" అనే కంపెనీలో పనిచేస్తున్నాను. బైదిబై ఇప్పుడు నీ శాలరీ ఎంత?" అతనే అడిగాడు.

"ఆc. ఎంతలెండి. అన్నీ కలిపి పదిహేనొందలొస్తాయి" అన్నాను.

"సరిగ్గా నా జీతమూ అంతే! కాకపోతే ఎటొచ్చీ నీకంటె ఓ వందరూపాయలు తక్కువ. ఆc అన్నట్లు ఈ ఊళ్ళో నీకు సుఖంగా ఉందా" నా యోగక్షేమాలు విచారించాడు.

"ఆc ఫరవాలేదు. కాకపోతే ఇక్కడి వాతావరణమే కాస్త చికాగ్గా ఉంది. నాల్గురోజులుంటే అదే అలవాటైపోతుంది" అన్నాను నా ఇబ్బందికి నన్ను నేనే ఓదార్చుకుంటూ.

"వాతావరణానిదేముందిలే-నాల్గురోజులైతే అదే అలవాటైపోతూంది" అని ఇంకా అతను ఏదో మాట్లాడబోతుండగా- సంతకాలకని - మా సెక్రెటరీ శంకరం ఫైలుతీసుకుని లోపలికొచ్చాడు.

సంతకాలు చేస్తున్నంతసేపూ ఏకాగ్రతకు భంగం కల్గిస్తూ నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్‌లా ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు.

బెల్‌కొట్టి, నూతనాగంతకుడికి, నాకు, మా శంకర్రావుకు మూడు కాఫీలు ఆర్డరిచ్చాను. కాఫీలొచ్చాయి.




మళ్ళీ మొదలెట్టాడు_

"ఈ రోజుల్లో ఊరికే కాఫీ, కాఫీ అని అఘోరిస్తారు కాని_ అసలు కాఫీ ఆరోగ్యానికి ఎంత భంగకరమని? అస్తమానమూ ఆఫీసుల్లో పనిచేసేవాళ్ళు అదేపనిగా కాఫీలు తాగుతుంటారు కదా! అదేమైనా రుచా_ పచా_ దాంట్లో ఏం గొప్ప ఉందో నా కర్థంకాదు. పైగా వైద్యనిపుణులందరూ కాఫీ ఆరోగ్యానికి భంగకరమైందని నెత్తిన నోరుపెట్టుకొని చెబుతున్నారు. అయినా మనం కాఫీ మానడంలేదు. అవునండి! మీ పేరేమిటో నాకు తెలియదుగాని...."

"నా పేరు శంకర్రావంటారు సార్."

తనపేరు చెప్పుకున్నాడు మా శంకర్రావు.

"చూడండి శంకర్రావుగారు! మీరైనా మావాడికి చెప్పి ఈ కాఫీలు మాన్పించలేకపోయారా? కొంపతీసి మీరూ కూడా పదే పదే కాఫీతాగడం ఇష్టమేనేమిటి? నా పిచ్చిగానీ_ ఈ రోజుల్లో కాఫీ అంటే చెవికోసుకోనివారు ఎవరుంటారు_ అంతకంటె పెద్ద పెద్దవే లాగేస్తూంటేనూ" ఇంకా ఏదేదో మాట్లాడుతూనే ఉన్నాడు.

"మరి వస్తాను సార్! నా క్కొంచెం పనుంది"_ అని అతని దగ్గర_ నా దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు మా శంకరం ఈ బోర్ భరించలేక_

అతనికంటే తప్పిందిగాని నాకు తప్పదు గదా! అప్పటికి నాల్గున్నర కావచ్చింది. ఇంకా చూడాల్సిన ఆఫీసు కాగితాలు చాలానే ఉన్నాయి. కాని ఈ నూతనాగంతకుడు నన్ను వదిత్తేగా! ఇంకా ధారావాహికంగా_ గడగడా_ డబ్బాలో గాళ్ళేసి కొట్టినట్లు _ మాట్లా

దేస్తూనే ఉన్నాడు కామా - ఫుల్‌స్టాప్ లేకుండా-

ఇహ ఈ రోజుకి ఆఫీసుపని చేయడం కుదరదు. ఇతనెవరో నన్నొదిలేటట్టు లేడు. నన్నొక్కణ్ణి విసిగించింది చాలక నా కోసరం వచ్చినవాళ్ళనుకూడా పని కట్టుకొని పలకరించి అయినవీ- కానివీ- అడ్డమైన కామెంట్సు పాసుచేస్తున్నాడు.

వాళ్ళు నా మొహం చూసి ఊరు కున్నారు కాని-లేకపోతే ఈపాటికి నాల్గు వడ్డించేవాళ్ళే.

నా కోసరం అలాంటి స్నేహితుడు వచ్చినందుకు నాకే ఎంతో సిగ్గుగా ఉంది.

ఇంతలో ఐదుగంటలైంది. ఎలాగూ ఇవాల్టికి ఒక పని కుదరదు- ఫైళ్ళన్నీ సర్ది- ఇంటికి వెళదామని లేచాను- ఇక నైనా అతను నన్ను వదిలేస్తాడేమోనన్న ఆశ ఏమూలనో నాకు లేకపోలేదు.

"అన్నట్టు- ఏరా- ఇల్లెక్కడ తీసుకు న్నావ్. ఇక్కడకు దగ్గరేనా" అన్నాడు.

'హతోస్మి- హరిభగవంతుడా! ఇక్కడ బోరుకొట్టింది చాలక ఇంటికూడా వస్తాడన్నమాట- ఈ మహానుభావుడు' నిరాశపడ్డాను.

"ఇల్లు చాలా దూరమండి- సీతారాం నగరంలో - ఆఫీసుకు కనీసం నాల్గయిదు మైళ్ళైనా ఉంటుంది-" అన్నాను. అలా గైనా నన్ను వదిలేస్తాడేమోనన్న ఆశతో-

"అం ఫరవాలేదులే. ఇంత పట్టణంలో మరీ ఆఫీసుకి దగ్గర్లో ఇళ్ళు దొరకా లంటే ఎలా కుదుర్తుంది. నాకిప్పుడేం పనిలేదు. మీ ఇంటిదాకా వచ్చి- మీ శ్రీమతినికూడా చూసి వెళతా. మళ్ళీ ఎన్నాళ్ళికి కలుసుకుంటామో ఏమో ?"

అంటూ నా కంటె ముందే చెప్పులు తొడుక్కుని బయట నుంచున్నాడు.

ఇక తప్పేదేముంది. అతన్ని నా స్కూటర్ వెనకాల కూర్చోబెట్టుకొని ఇంటికి తీసుకొచ్చాను.

అతడు చిరపరిచితుడిలా నా కంటే ముందే మా డ్రాయింగ్‌రూంలో కెళ్ళి సోఫాలో వాలి విశ్రాంతి తీసుకుం టున్నాడు.

"ఇ ప్పు డే వ స్తా న ం డి"- అని డ్రాయింగ్‌రూంలో ఫ్యానువేసి లోపలి కెళ్ళాను.

"ఎవరండీ ఆయన? ఎప్పుడూ చూసి నట్టులేదు. ఎవరైనా మీ స్నేహితుడా" ప్రశ్నించింది మా శ్రీమతి. ఇంతవరకూ నేను అనుభవిస్తున్న మానసిక వేదన తనకేం తెలుసు.

"ఎవరో బాగా తెలిసినవాడిలాగే మా ట్లా డు తు న్నా డు. నాకు మాత్రం జ్ఞాపకం రావడంలేదు. నా చిన్నప్పటి విషయాలన్నీ కరెక్టుగా చెబుతున్నాడు. ఓసారి మన ఇంటినీ నిన్నూ చూస్తా నంటూ నావెంటపడి వచ్చాడు." అన్నాను అతన్ని ఇంటికి తీసుకురావడంలో నా తప్పేమీలేదనట్టు.

"అలాగా! ఎవరో మీ పాతస్నేహి తుడై ఉంటాడులెండి మీ కసలే మతి మరుపు. అప్పుడప్పుడు ఇంట్లోవాళ్ళను

కూడా మీరు మరచిపోతుంటారు! దాందే ముందిలెండి. మీరు పదండి నేను కాఫీ, టిఫిను తిసొక్కొస్తా" నంది మా ఆవిడ.

బతుకుజీవుడా అనుకుంటూ మళ్ళీ డ్రాయింగ్‌రూంలో కొచ్చాను ఆఫీసు గుడ్డలుకూడా విప్పకుండానే.

ఎలాగూ అతను వెళ్ళింతర్వాత విశ్రాంతి తీసుకుందాంగదా అనుకున్నాను.

ఇంతలో మా శ్రీమతి కాఫీ, టిఫిను తీసుకుని డ్రాయింగ్‌రూంలో కొచ్చింది.

"మా శ్రీమతండీ! పేరు కనకం" పరిచయం చేసాను.

"నమస్కారం! వీడూ - నేనూ - చాలా దగ్గరి స్నేహితులమండీ! వీడికేదీ జ్ఞాపకం ఉండదు. మొదట్నించీ ఇంతే వీడ వరస. ఏదో అదృష్టం బాగుండి ఆఫీసరయ్యాడు కాని-బొత్తిగా ప్రపంచం తెలియనివాడు. చివరకు క్లాసుమేటుని-ఆప్తమిత్రుణ్ణయిన నన్నే మర్చిపోయాడు- వీడితో మీరెలా కాపురం చేస్తున్నారో" అని ఓ విట్టు విసిరాడు.

ఆ విట్టుకి వాళ్ళిద్దరూ నవ్వారు. ఇక తప్పదన్నట్లు నేనుకూడా నవ్వాను.

కాఫీ, టిఫిన్లు పూర్తయింతర్వాత మళ్ళీ మొదలేసాడు తన ధోరణి-ఎంతకీ అది తెగడంలేదు ఆరైంది, ఏడైంది- ఎనిమిదైంది

అతను ఇంకా ఏమేమో మాట్లాడుతూనే ఉన్నాడు.

నాలో ఓపిక పూర్తిగా చచ్చిపోయింది. తలనొప్పి కూడా వస్తూన్నది.

ఉదయనుంచి సాయంత్రం దాకా ఆఫీసులో పనిచేసిన నా శరీరం- ఇతని అనవసర ప్రసంగంతో- పూర్తిగా అలసిపోయింది.

ఇంకా స్సేపుంటే శరీరమూ-మనసూ-స్వాధీనం తప్పుతూందేమో అన్నట్లుగా ఉంది. ఏం చేయాలో తోచక -

"నా కెందుకో విపరీతంగా తలనొప్పి పుడుతోందండీ" అన్నాను.

"సరేరా! మరినేనొస్తా - ఆ తలనొప్పికి బిళ్ళలేవైనా వేసుకో. కొంచెం బజారులో పనుంది. వెళ్ళాలి. నీవు మరోలా అనుకోకపోతే ఓచిన్న రిక్వెస్టు. అర్జంటుగా అవసర మొచ్చింది. ఓ రెండొందలు సర్దావంటే ఎల్లుండి కంపెనీ పనిమీద ఈ ఊరొచ్చినప్పుడు మళ్ళీ ఇచ్చేస్తాను." అన్నాడు నెమ్మదిగా తను వచ్చిన పని బయటపెడుతూ.

నాకు మతిపోయినంత పనైంది

నా దగ్గర రెండొందలు కావుగదా - వంద రూపాయలు కూడా లేవు. ఎలాగూ ఎల్లుండి ఫస్టుతారీఖే కదా అని బ్యాంకు నుంచి డబ్బుతేలేదు. ఇంటి ఖర్చులకని ఉంచిన ఓ యాభై రూపాయలు మాత్రం మా ఆవిడ దగ్గర ఉన్నట్లు జ్ఞాపకం.

ఆ మాటే అతనితో అందామంటే ఉందికూడా లేదని అబద్ధం చెబుతున్నాడని ఎక్కడనుకుంటాడో -? అదీగాక - ఇంటి ఖర్చులకోసం ఉంచుకొన్న యాభై ఇవ్వమంటే మా ఆవిడేమంటుందో ?

అడకత్తెర్లో పోకలాగుంది నా పని. సరే? ఎలాగో ధైర్యం తెచ్చుకొని ఉన్న వాస్తవమే అతనితో అన్నాను.

"అరే! సమయానికి_మీరడిగినప్పుడే డబ్బు చేతిలో లేకుండా పోయిందే! మరోలా అనుకోకుండా ఉంటే - ఓ యాభై రూపాయలు మా ఆవిడదగ్గ రుండాలి - ఇవ్వమంటే అడిగిస్తాను" అన్నాను.

"అదేమిట్రా! పదిహేనొందలు సంపాదించే ఆఫీసర్నంటున్నావ్. ఆ మాత్రం ముష్ఠి రెండొందలు నీ దగ్గర్లేక పోయాయా? సరే. పోనీలే_ఏం చేస్తాం_ ఆ యాభై ఇటు పడెయ్. మళ్ళీ ఎల్లుండి ఇస్తా"_ అని నాతో నిష్ఠూరాలాడి_నా మీద జాలికనబరుస్తున్న పోజుపెట్టి - ఆ యాభై పట్టుకపోయాడు. అతన్ని గుమ్మందాకా సాగనంపి ఇంట్లో కొచ్చాను.

"వెళ్ళాడాండి మీ చిన్ననాటి స్నేహితుడు"_మా ఆవిడ ప్రశ్నించింది.

"ఆఁవెళ్ళాడుఇప్పటికి. నా ప్రాణాలు నిలువునా తోడేశాడు. అసలు వీడెవడో నాకిప్పటికీ గుర్తు రావడంలేదు" అన్నాను దీనంగా ముఖం పెట్టి.

"మీకు దొరికే స్నేహితులంతా ఇలాంటివాళ్ళేలెండి. ఇకలేవండి భోం చేద్దాం." అంది మా ఆవిడ, నా మీద కామెంటు చెయ్యడానికి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని.

అలా - ఆ రోజు ఎల్లుండి వస్తానని పోయినవాడు మూణ్ణెల్లైనా కన్పించలేదు.

పోతే పోయిందిలే_ యాభై రూపాయల్తో వదలిపోయింది పీడ అని తృప్తి పడి ఊరుకున్నాం.

ఉన్నట్టుండి మళ్ళీ మూణ్ణెల్ల తర్వాత ఓ రోజు అకస్మాత్తుగా ఊడిపడ్డాడు.


ఈసారి ఆఫీసుకురాక సరాసరి ఇంటికే వచ్చేసాడు.

"సారీరా మల్లిక్! మళ్ళీ ఈ ఊరు రావడం ఇన్ని రోజుల్నుంచి పడనేలేదు. నీ యాభై రూపాయలు నా దగ్గరే ఉండి పోయాయి. నీ వేమనుకుంటున్నావో ఏమోనని సిగ్గుతో చచ్చిపోతున్నాననుకో" అని యాభైనోటు తీసి చేతిలోపెట్టాడు.

"అఁ. దాందేముందిలెండి. మనిషన్న తరువాత అవసరమనేది ఎవరికైనా వస్తుంది. దాని కింతగా చెప్పాలా? ఏటొచ్చీ ఆ రోజు మిరడగ్గానే రెండు వందలు సర్దలేకపోయానే అని కొంచెం నేనే బాధపడ్డాను" అన్నాను. అతని నిజాయితీని అనవసరంగా శంకించిన నన్ను నేనే తిట్టుకుంటూ_

మళ్ళీ ఓ రెండు మూడు గంటలు లోకాభిరామాయణంతో నన్ను విసిగించి భోంచేసి వెళ్ళిపోయాడు.

"చూశారా! అనవసరంగా ఖంగారు పడ్డారు. పాపం అతను నిజాయితీ గలవాడే. మనమే అనవసరంగా అతన్ని శంకించాం" అంది అ తప్పు పూర్తిగా నాదేనన్నట్లు మా శ్రీమతి.




ఈసారి మళ్ళీ వారం తిరక్కుండానే వచ్చాడు. నాకు ఇంకా జ్ఞాపకంరాని– మా రావ్.

సరిగ్గా మేం భోజనానికి లేచే టైం.

మేము భోజనానికి లేవబోతున్నాం.

అతను సూటుకేస్ తీసుకొని వచ్చాడు.

మేము భోజనానికి లేవడం ఆపి–

"సరిగ్గా సమయానికే వచ్చారు. లేవండి అందరం కలిసే భోంచేద్దాం" అన్నాను అతని నుద్దేశించి.

"ఒరేయ్. ఇవాల్టికి నన్ను క్షమించరా! బాగా ఆకలిగా ఉంటే వస్తూ వస్తూ హోటల్లో భోంచేసి వచ్చాను. మరోసారి మీ ఇంట్లో తప్పకుండా భోంచేస్తాగా. మీరు కానివ్వండి. నేను ఈ లోపు పేపరు చూస్తుంటా!" అని నా సమాధానం కోసం ఎదిరుచూడకుండానే పేపర్లోకి తలదూర్చాడు.

సరే. ఇహ అతన్ని బలవంత పెట్టి లాభంలేదనుకొని మేము వెళ్ళి భోంచేసి వచ్చాం.

మా భోజనాలయి వచ్చేసరి ఓ అర గంటో, ముప్పావు గంటో అయి ఉంటూంది. ఈలోపు ఆగంతకుడు నిద్రతో కూర్చొట్లుపడుతున్నాడు.

మేం భోంచేసి రాగానే–ఎప్పుడు గంటలు గంటలు మాట్లాడేవాడల్లా–ఇక ఉండలేనన్నట్లు–లేచి నిల్చొన్నాడు.

"ఒరేయ్! మల్లిక్! నేనొస్తాన్రా! రాత్రంతా ట్రెయిన్‌లో నిద్రలేదు.

ఉదయంనుంచి కంపెనీ పన్లే సరి పోయాయి. నిద్ర ముంచుకొస్తూంది. మరి నేనొస్తా సెలవ్"

అని సెలవుతీసుకొని వెళ్ళిపోయాడు

ఈరోజు ఇంత తొందరగా మమ్మల్ని వదిలి వెళ్లినందుకు భగవంతుడికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకొన్నాను.

కాఫీపు న్యూసుపేపరు తిరగేసి – ఇక పడుకుందా మనుకునే సరికి – మా అవిడ కూడా వంటింట్లో పని ముగించు కొని – తడిచేయి తువ్వాలుకు తుడుచు కొంటూ డ్రాయింగ్‌రూంలో కొచ్చింది.

"ఏమిటి అలా కూర్చున్నారు. అంత డల్‌గా ఉంటే రేడియో ఆన్‌చేయండి. ఇవాళ్ళేదో మంచి నాటకం కూడా ఉంటూంది" అంది.

నేను యధాలాపంగా కుర్చీమీది నుంచి లేవకుండానే రేడియోవైపు చేయి పోనిచ్చాను.కాని రేడియో దాని స్థానంలో లేదు.

"కనకం ! ట్రాన్సిస్టరు లోపల పెట్టి నన్ను రేడియో పెట్టమంటే ఎలా ?" అన్నాను.

"అబ్బే లేదండి. నేను రేడియో లోపలికి తీసుకెళ్ళందే. అక్కడే ఉండాలి చూడండి." అంది ఖంగారుగా.

ఇల్లంతా వెతికాం. ఇంకెక్కడి రేడియో. మా ఫారిన్ రేడియోతోపాటు, టేప్‌రికార్డరు, నా కాస్ట్లీ రిస్ట్‌వాచీ, టేబుల్‌మీద పర్సు కన్పించలేదు.

మా అవిడ లబోదిబోమంది.

అంతా కలిపి నాల్గయిదు వేలదాకా పోయినట్లే !

ఏం చేస్తాం. పెళ్ళాంతో దెబ్బలు తిన్నా – అంగట్లో ధగాపడ్డా ఎవరికీ చెప్పకూడదంటారు–సరిగ్గా అలాగే ఉంది మా పరిస్థితి కూడా.

ఇంతలో మా అవిడ ఏడుస్తూనే చెప్పడం మొదలెట్టింది !

"సిటీలో కొత్తగా వచ్చినవాళ్ళను నమ్మకూడదంటే మీరు వింటారూ ? అడ్డమైనవాళ్ళను కొంపమీదికి తీసుకొస్తారాయె!" అని ఇంకా ఇలా అంది.

"పక్కింటి రామాయమ్మ చెప్పింది.

"మొన్నొకరో ఇలాగే హరిహరరావు గారింటికొచ్చి – నేను హరిహరరావుగారి బావమరిదిని – మా అక్కయ్య, బావ రైల్వేస్టేషన్లో ఉన్నారు. ఇంట్లో కొత్త బట్టల సూటుకేసు మరచిపోయారట. మీ ఇంటి దగ్గర తాళంచెవి ఉంది – తాళపు చెవి తీసుకొని సూటుకేసు తీసుకురమ్మ న్నారు" అని పక్కింటి వాళ్ళను నమ్మించి తాళం అడిగి పుచ్చుకొని – సుబ్బరంగా ఓ పావుగంటలో పదివేల దాకా కాస్ట్లీ సామాన్లు సూటుకేసులో పెట్టుకొని – తాళం మళ్ళీ పక్కింట్లో ఇచ్చేసి – రిక్షా తెప్పించుకొని – ఎక్కి చక్కాపోయాడుట –

"తరవాత హరిహరరావుగారి వాళ్ళు వచ్చి – మాకు బావమరది లేడు– వల్లకాదు

లేదు - అని నెత్తీ-నోరు బాదుకున్నారట.

"అసలే రోజులు బాగాలేవు. అందునా ఈ పట్టణాల్లో మోసగాళ్ళు - ఎప్పుడు - ఏ రూపంలో ఏవంక పెట్టుకొని వస్తారో - తెలియకుండా ఉంది."

అంది తన లేటెస్టు అనుభవాన్ని వివరిస్తూ-

"సరే! ఇప్పుడనుకొని ఏం లాభం- చేతులు కాలింతర్వాత ఆకులు పట్టుకొన్నట్లు" - అన్నాను.

"మరిప్పుడేమిటి దిక్కు. మన పోయిన వస్తువులను అలా వదిలేసి నట్లేనా!?" అంది నిస్పృహగా - మా శ్రీమతి.

"వదిలేయక చేసేదేముంది!

ఇలా మా మాటలు పూర్తికాకముందే- "టెలిగ్రాం సార్!" అని టెలిగ్రాం తెచ్చాడు టెలిగ్రాఫిస్టు.

అందులో ఇలా ఉంది. "సారీరా మల్లిక్! నీ టేపురికార్డరు అవి ఓసారి చూద్దామని తెచ్చాను. కాని అవి ఏమీ బాగాలేవు తెలుసా! అలాంటి అరిగి పోయిన టేపురికార్డర్ - నీలాంటి గెజిటెడ్ ఆఫీసర్ ఇంట్లో ఉండ వలసిందేనా! అది మీ ఇంట్లో ఉంటే నీ స్టేటస్‌కే భంగం. అంచేత అనుకో కుండా నాతో తెచ్చేసాను. ఏమీ అను కోకేం! మళ్ళీ అవన్నీ పంపిద్దామను కున్నాను. కాని ఎందుకులే-ఈ మూలంగా నైనా నీవు కొత్త వస్తువులు కొనుక్కుంటావని నాతోటే ఉంచేసా! చాలా థ్యాంక్సురా! మరి ఉండనా! గుడ్ బై" అని ఉందికాని ఆ టెలిగ్రాం ఎక్కడ నుంచి వచ్చిందో అడ్రసుమాత్రం లేదు.

ఆ టెలిగ్రాం చూసి మా ఆవిడా- నేను అవాక్కైపోయాం. బహుశా ఇది కూడా ఈనాటి నాగరికతలో ఒక భాగం కామోసు" అని ముక్కుమీద వేలు వేసుకున్నాము.

